మినీకథ:

# సీటు

సూర్యారావుగారు ఆకాశంలో చలిఘంట వేసారు. ఆ సెగ తగిలి నాకు చెమటలు పోసేస్తున్నాయి. వెధవ బస్ ఎంతకీ వచ్చి చావదే? ఎండలో ఎంతసేపీ నిరీక్షణ? జేబు గుడ్డతో ముఖం తుడుచుకుంటూ ప్రక్కన నిలబడి ఉన్న అమ్మాయిని చూసి ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. చంచలకు ఆ అమ్మాయికి చాల పోలికలున్నాయి.

- ఛీ! చంచల మళ్ళీ గుర్తుకొచ్చింది. 'మనసా! మనసా! ఆ చంచలను మాత్రం నాకు మళ్ళీ గుర్తుచేయకు'' అని ఎన్నోసార్లు వేడుకున్నాను కాని ఏం ప్రయోజనం. ఏదో ఒక వంకతో చంచలను గుర్తుచేయక మానదు, పాడు మనసు.

చంచలని పేరు ఎందుకు పెట్టారో గాని పేరు మాత్రం సార్థకం చేసుకొంది. చిన్నప్పటినుండి అనుకున్న మేనరికాన్ని వదులుకుని నిన్నే ప్రేమించానని చంచల అన్నప్పుడు నిజమేనని నమ్మేసాను. నువ్వు లేకపోతే బ్రతకలేనంది. అదీ నమ్మేసాను.

కాని చంచల ఏం చేసింది?

అదిగో బస్సొచ్చింది. క్రిక్కిరిసి ఉంది. దేవుడా నిలబడడానికి చోటుంటే చాలనుకున్నాను. సరిగ్గా నిలబడడానికే చోటు దొరికింది. బస్సు కదిలింది. వెనుక నిలబడ్డాయన మాటిమాటికీ మీద పడుతున్నాడు. డొక్కలో పొడుస్తున్నాడు. చిరాకేసింది నాకు. ఏదయినా సీటు ఖాళీ అయితే బాగుండుననుకున్నాను. అనుకున్నానో లేదో పక్కనే ముగ్గురు ఆడవాళ్ళు లేచారు. తటాలున కూర్చున్నా.

ఇంతకీ ఎక్కడాగాను? అవును. చంచల ఏం చేసింది? వాడెవడ్నో పెళ్ళాడింది. కారణం వాడికి డబ్బుందట. నన్ను చూసి బావను వద్దంది. వాడి డబ్బు చూసేసరికి నే ఫేడౌట్ అయిపోయాను. రేప్పొద్దున్న ఇంకా డబ్బున్నవాడు కనిపిస్తే వాడివెంట పడుతుందా? హుఁ. దీనికి సమాధానం ఒకటో క్లాసు కుర్రాడు కూడ చెప్తాడు.

బస్సాగింది. అటుప్రక్క మగవాళ్ళ సీటొకటి ఖాళీ అయింది. నే నక్కడ చేరాను. అమ్మయ్య! ఆడవాళ్లొస్తే లేచి నిలబడాల్సిన బాధ తప్పింది. బస్ మూలుగుతూ కదిలింది. బస్‌లో జనాభా ముందుకన్నా పెరిగింది. పక్కనున్న పశువెవడో కాలు తొక్కాడు. గుర్రుగా చూసాను. ఈ పక్కనున్న పీఠాధిపతి దిగితే బాగుండును. హాయిగా కిటికీ పక్కనే కూర్చోవచ్చు. గాలయినా తగులుతుంది. సరిగ్గా అప్పుడే మెరిసింది నా బుర్రలో మెరుపు. మొదట్లో నిలబడడానికి చోటు దొరికితే అదే చాలనుకున్నాను. ఇప్పుడు కిటికీ దగ్గర సీటు కావల్సి వచ్చింది నాకు. మరి ఇంకా చంచలను తిట్టుకోవడమెందుకు?

అంతే! ఆ తరువాత చంచలను మళ్ళీ జీవితంలో నేను గుర్తు చేసుకోలేదు. ఆడిపోసుకోలేదు.

—విజయ్